క్లుప్తంగా

ఆర్వేటమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రసన్న



ఆర్వేటమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: మండల కేంద్రమైన కొడవలూరులో ఆర్వేటమ్మను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆర్వేటమ్మ ఆలయంలో జరుగుతున్న తిరునాళ్లలో భాగంగా రెండోరోజున గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు నల్లావుల శ్రీనివాసులు, దేవనబోయిన శివకుమార్, మందపల్లి మల్లికార్జున, పొబ్బా రవి, ఉదయ్, ఎస్ నాగేశ్వరరావు, కే నాగేశ్వరరావు, పీ.మురళి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పొదలకూరు : పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో హేమలతారెడ్డి న్యూరో స్పెషాలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి నరాల సంబంధిత సమస్యలతో వచ్చిన రోగులకు డాక్టర్ హేమలతారెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ఇసుక రీచ్‌ను నిలిపివేయాలి



ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడులోని ఇసుక రీచ్‌ను నిలిపివేయాలని గ్రామస్తులు కోరారు. ఆదివారం వారు పెన్నా నదిలోని ఇసుకరీచ్ నుంచి ఇసుక తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. నాగరాజుతోపు వద్ద అనుమతులు తీసుకుని పల్లిపాడు నుంచి ఇసుకను తరలించడం ఏమిటని ప్రశ్నించారు. పెన్నా నదిలోని ఇసుకను ఇష్టానుసారంగా తరలిస్తే భూగర్భజలాలు అడుగంటే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఇసుక రవాణాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న కోవూరు సీఐ కే రామకృష్ణారెడ్డి,ఎస్సై రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

విశ్వరూప మహాసభ జయప్రదానికి పిలుపు



మనుబోలు: మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సూరిపాక వాసుదేవరావు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టులో చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమ జయప్రదానికి మండలంలోని కొండుపాళెంలో సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉదయ్‌కృష్ణ, అంబేడ్కర్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోడూరు బీచ్‌లో సందర్శకుల సందడి



తోటపల్లిగూడూరు: కోడూరు బీచ్‌లో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. జిల్లా నలువైపుల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తీరానికి చేరుకుని సేదతీరారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన సందర్శకులు, యువత గంటల తరబడి బీచ్‌లో మునుగుతూ ఆనందంగా గడిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి.

జగనన్న ఇళ్లలో ముత్తుకూరు ఫస్ట్



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు వంపన వీరబాబు. గతంలో నివేశన స్థలం, సొంతిల్లు లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముత్తుకూరు సమీపంలోని జగనన్న కాలనీలో ఇంటి పట్టా, పక్కాఇల్లు మంజూరు చేసింది. మండలంలోనే మొదటగా గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకుని గృహ ప్రవేశం చేశాడు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి సైతం గృహప్రవేశానికి హాజరై గృహాన్ని ప్రారంభించి అభినందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారులో తన సొంత ఇంటి కల నెరవేరిందని వీరబాబు సంతోషం వ్యక్తం చేశాడు.

- జగనన్న కాలనీల్లో శరవేగంగా నిర్మాణాలు
- సర్వేపల్లి నియోజకవర్గంలో 57 శాతం పురోగతితో ముందంజ



ఈదులవారిపాళెంలో జగనన్న కాలనీలో శ్లాబ్ దశలో పక్కాగృహాలు

ముత్తుకూరు: మండలంలోని జగనన్న కాలనీల్లో జగనన్న గృహ నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 57శాతం గృహ నిర్మాణాల పురోగతితో ముత్తుకూరు మండలం ముందంజలో ఉంది. మండలంలోని లబ్ధిదారులతో అధికారులు తరచూ సమావేశమై అవగాహన కల్పించడం..సకాలంలో బిల్లుల చెల్లింపులు చేయడం, మెటీరియల్ అందుబాటులో ఉంచడంతో గృహ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఫలితంగా గ్రామాల్లో నూతన కాలనీలు పురుడుపోసుకుంటున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదలకు గూడు కల్పించాలని సంకల్పించింది. వైఎస్సార్ సీపీ నాయకుల చొరవతో గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలు, అవి లేని చోట ప్రైవేట్ స్థలాలను సైతం కొనుగోలు చేసి జగనన్న కాలనీ లేఅవుట్లు నిర్మించింది. అందులో అర్హులైన పేదలకు మహిళల పేరుపై ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడంతో పాటు గృహ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. ఫలితంగా జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ముత్తుకూరు, బ్రహ్మదేవి, పంటపాళెం, మామిడిపూడి, వల్లూరు, నారికేళపల్లి పంచాయతీల్లో పక్కా గృహాల నిర్మాణం సందడిగా కొనసాగుతోంది. గిరిజన లబ్ధిదారులకు రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సీఎస్సార్ నిధుల నుంచి అదనంగా రూ.15వేలు సాయం అందించడంతో వారు ఉత్సాహంగా గృహాలను నిర్మించుకుంటున్నారు. మండలాధికారులు ఎప్పటికప్పుడు గృహ నిర్మాణాలపై సమీక్షిస్తుండడంతో గృహ నిర్మాణాల్లో పురోగతి కనిపిస్తోంది. మరో వైపు ప్రజాప్రతినిధులు చేదోడుగా ఉండడం పేదలకు వరం అయింది. ముత్తుకూరు సమీపంలోని ఆర్అండ్‌ఆర్ కాలనీలో అన్ని సౌకర్యాలతో గృహ ప్రవేశాలు సైతం జరిగిపోయాయి. మిగిలిన కాలనీల్లో క్రమంగా అన్ని సౌకర్యాలు సమకూరుతున్నాయి. త్వరలోనే గృహ ప్రవేశాలు జరుపుకొనేందుకు కాలనీలకు కాలనీలు సిద్ధమవుతున్నాయి.

ముత్తుకూరు మండలంలో గృహ నిర్మాణాలు

జగనన్న కాలనీలు	30
మంజూరైన ఇళ్లు	3,074
గృహ ప్రవేశం చేసినవి	1,299
పూర్తయినవి	848
శ్లాబు దశ	68
రూఫ్ లెవల్	271
బేస్‌మెంట్లు	588

సర్వేపల్లి నియోజకవర్గంలో గృహ నిర్మాణాల పురోగతి

మండలం	శాతం
ముత్తుకూరు	57
పొదలకూరు	11
తోటపల్లిగూడూరు	35
మనుబోలు	47
వెంకటాచలం	39

గృహ ప్రవేశాలు ప్రారంభం



ముత్తుకూరు సమీపంలోని జగనన్న కాలనీ(ఆర్అండ్ఆర్)లో తొలిసారిగా గృహప్రవేశాలు ప్రారంభమయ్యాయి. మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి చేతుల మీదుగా గృహ ప్రవేశం ప్రారంభమైంది. అధికారులు, నాయకుల కృషి ఫలితంగా గృహ నిర్మాణాల్లో ముత్తుకూరు మండలం సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో ఉండడం సంతోషంగా ఉంది.

–గండవరం సుగుణ, ఎంపీపీ, ఆర్అండ్ఆర్ కాలనీ

గృహ నిర్మాణాలు వేగవంతం



ప్రజాప్రతినిధులు, నాయకుల సహకారంతో మండలంలోని జగనన్న కాలనీల్లో పక్కాగృహాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. సర్వేపల్లి నియోజకవర్గంలో గృహ నిర్మాణాల్లో ముత్తుకూరు మండలం 57శాతం పురోగతిలో ముందంజలో ఉంది. గృహాలు ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి పక్కాగృహానికి ఇంకుడు గుంట నిర్మాణానికి రూ.6వేలు మంజూరయ్యాయి.

–సుబ్రహ్మణ్యం, ఏఈ, హౌసింగ్.



బ్రహ్మదేవిలోని జగనన్న కాలనీలో గృహనిర్మాణాలు



ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్మాణంలోని పక్కాగృహాలు

మర్యాదపూర్వకంగా..



తోటపల్లిగూడూరు: రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పేడూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా నియమితులైన ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. తనపై విశ్వాసంతో పేడూరు సొసైటీ అధ్యక్షుడిగా తనను నియమించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, సొసైటీ సీఈఓ రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల మధు, ఎంబేటి సంధ్యారాణి, దేవళ్ల శ్రీనివాసులరెడ్డి, బొచ్చు సుబ్రహ్మణ్యం, తదితరులు ఉన్నారు.

కోటి కుంకుమార్చనకు ఎంపీ ఆదాలకు ఆహ్వానం



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న కోటి కుంకుమార్చన కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యనాయుడు ఆదివారం ఆహ్వానించారు. నెల్లూరులోని నివాసంలో ఎంపీని కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. విజయడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని కూడా కలిసి ఆహ్వానించినట్లు ఆలయ చైర్మన్ తెలిపారు.

ప్రజల వద్దకే పారదర్శక పాలన



వృద్ధురాలికి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- 99 శాతం వాగ్దానాలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పారదర్శక పాలనను అందిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటరీ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను దాదాపు 99 శాతం నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు 600 వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లోనూ చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటి వరకు గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలోని 75 సచివాలయాల పరిధిలో 86 వేల ఇళ్లను సందర్శించామని తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు సంతోషంగా తమకు స్వాగతం పలుకుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల నగదును ఒక్క బటన్‌తో నొక్కి తమ ఖాతాల్లో జమ చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో చిన్న వయస్సులోనే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని గుర్తుచేశారు. అవినీతికి ఆస్కారం లేకుండా పాలన సాగిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్ కలిసి ఎన్ని కుట్రలు చేసిన ఈ రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగడం ఖాయమన్నారు. పవన్ కళ్యాణ్‌కు సూట్‌కేస్ వెళ్లిన తరువాత రోజు చంద్రబాబు స్క్రిప్ట్‌ను చదువుతాడని విమర్శించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రతి ఎమ్మెల్యే ధైర్యంగా ప్రతి గడపకు వెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు యానాదిరెడ్డి, సత్యనారాయణ, షకీలాబేగం, ప్రత్యూష, అనంతమ్మ, జయంతి, ప్రమీలమ్మ, నాయకులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, మోర్ల మురళీ, శ్రీకాంత్‌రెడ్డి, భరత్, కావలి వెంకటేశ్వర్లు, అల్లాబక్షు, డాక్టర్ అల్లాబక్షు పాల్గొన్నారు.

శాకంబరిగా చాముండేశ్వరిదేవి



శాకంబరి అలంకరణలో అమ్మవారి మూలవిరాట్



పండ్లు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించిన ఆలయ మండపం

ఇందుకూరుపేట : గంగపట్నంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చాముండేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారికి శాకంబరి అలంకారాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఆలయాన్ని పండ్లతో పాటు కూరగాయలతో విశేషంగా అలంకరించారు. శివశంకరుడు, మీనాక్షీదేవి, విఘ్నేశ్వరుడు వంటి దేవతా స్వరూపాలతో పాటు నెమలి, బాతు, కోడి, పక్షులు, చేపలు వంటి జీవరాశులు, జలరాశులను పండ్లు, కూరగాయలతో ఆకర్షణీయంగా రూపొందించారు. ఉభయకర్తలుగా రాజరాజేశ్వరి రైస్ ఇండస్ట్రీస్(నెల్లూరు) అధినేత కొలపర్తి రమేష్, సువర్ణలత, కుమారుడు లిజిత్‌కుమార్ వ్యవహరించారు. శాకంబరి అలంకారంలోని అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిషోర్‌స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటాలు, భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తుల రాకతో ఆలయం కోలాహలంగా మారింది. ఆలయ ఈఓ బండి శాంతయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొదుపు రుణాలతో గృహాలు పూర్తి చేసుకోవాలి

కొడవలూరు: గృహ లబ్ధిదారులు పొదుపు రుణాలను సద్వినియోగం చేసుకుని గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ పీ సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో 249 గృహాలు బేస్‌మెంట్ దశలో నిలిచి ఉన్నాయని తెలిపారు. వాటికి సంబంధించిన లబ్ధిదారులు పొదుపు రుణం రూ.35 వేలతో నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. ఇప్పటికే మండలంలో 416 గృహాలను పొదుపు రుణాలతో పూర్తి చేసినట్లు తెలిపారు. బేస్‌మెంట్ తర్వాత నగదు అవసరమై నిర్మాణాలు నిలిచి ఉన్నాయన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి పొదుపు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నారని వివరించారు. పొదుపు రుణం అవసరమైన వారు వైకేపీ ఏపీఎంను సంప్రదించి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు.

వేమిరెడ్డి వజ్రావతమ్మకు నివాళులు

కొడవలూరు: నారాయణ విద్యా సంస్థల సీఈఓ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తల్లి వేమిరెడ్డి వజ్రావతమ్మ ఆదివారం వయోభారంతో మృతిచెందారు. మండలంలోని గండవరంలోని స్వగృహంలో ఉంచిన ఆమె భౌతికకాయాన్ని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి స్వగ్రామం సందర్శించి నివాళులర్పించారు. వేమిరెడ్డి సోదరులకు సానుభూతి తెలిపారు.

నాగాలమ్మకు మంత్రి కాకాణి పూజలు



నాగాలమ్మను దర్శించుకుని హారతి తీసుకుంటున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: నేలటూరులోని దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లోని గ్రామదేవత నాగాలమ్మ ఆలయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణిని ఆలయ అర్చకులు ఆశీర్వదించారు. తొలుత నాగాలమ్మ ఆలయానికి వచ్చిన మంత్రి కాకాణికి స్థానిక వైఎస్సార్‌సీపీ నేత శీపారెడ్డి రామమోహన్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీపీ గండవరం సుగుణ, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, గండవరం సూరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య రక్షణలో..

వలంటీర్లకు వందనం



దోమల మందు పిచికారీ చేయిస్తున్న వలంటీర్ శ్రీనివాసులు(ఫైల్)

ఈ ఫొటోలో వర్షపునీటిలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న వలంటీరు పేరు అన్నదానపు శ్రీనివాసులు. పొదలకూరు సచివాలయం బిట్–1 పరిధిలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. వర్షాకాలంలో ఎమ్మార్వో కాలనీలో వర్షపు నీరు నిల్వ చేరిన సమయంలో దోమలు వృద్ధి చెందకుండా దోమల మందు పిచికారీ చేయిస్తుంటాడు. ప్రజలు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా వైద్యారోగ్యశాఖ, పంచాయతీ సిబ్బంది సహకారంతో తన ప్రాంతంలోని వర్షపునీటి నిల్వలను గుర్తించి మందు పిచికారీ చేయిస్తుంటాడు.

అ'పూర్వ' కలయిక

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1992–93 బ్యాచ్‌కు చెందిన టీటీసీ విద్యార్థులు ఒకరికొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. తొలుత దివంగతులైన అధ్యాపకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థులతో కళాశాల సందడిగా మారింది.



సమావేశమైన డైట్ విద్యార్థులు



ఎంకేఆర్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట: మండలంలోని ఎంకేఆర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. 1996–97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఒకరికొకరు కలుసుకుని కుటుంబ సభ్యుల యోగక్షేమాలను తెలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం అప్పటి గురువులు శర్మ, అమానుల్లా, రాజేంద్రప్రసాద్, విజయేంద్రశర్మ, మల్లీశ్వరి, రాజేశ్వరి, తదితరులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.

ఈ-క్రాప్‌ను విధిగా నమోదు చేసుకోవాలి

కొడవలూరు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు విధిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రైతు భరోసా, పంట రుణాలు, వ్యవసాయ శాఖ రాయితీలు పొందాలన్నా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవాలన్నా ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని తెలిపారు. రైతులు అందుబాటులో ఉండకపోవడం వల్ల ఈ-క్రాప్ నమోదులో జాప్యం జరుగుతోందని చెప్పారు. రైతులు తీరిక వేళల్లో ఆర్బీకేలోని వీఏఏను సంప్రదించి ఈ-క్రాప్‌లో సాగుచేసిన పంటలు నమోదు చేసుకోవాలని సూచించారు.